క్లుప్తంగా

బాలదుర్గమ్మకు స్వర్ణ కర్ణాభరణాల సమర్పణ



అమ్మవారికి స్వర్ణ కర్ణాభరణాలు సమర్పిస్తున్న ఎంపీపీ దుర్గారావు, వెంకటలక్ష్మి దంపతులు

దేవరపల్లి: స్థానికంగా కొలువైన బాలదుర్గమ్మ వారికి ఎంపీపీ కేవీకే దుర్గారావు, వెంకటలక్ష్మి దంపతులు, కుటుంబ సభ్యులు శనివారం సుమారు రూ.51 వేలతో తయారు చేయించిన స్వర్ణ కర్ణాభరణాలు బహూకరించారు. అమ్మవారికి పూజలు నిర్వహించి అలంకరణ చేశారు. కార్యక్రమంలో అర్చకులు అఖండ వంశీకృష్ణ, ఆలయ కమిటీ చైర్మన్ పైడికొండల సత్యనారాయణ, కామిశెట్టి దుర్గారావు, భక్తులు పాల్గొన్నారు.

రోగికి 'మానవత' ఆర్థిక సాయం

నల్లజర్ల: క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న మండలంలోని అచ్చన్నపాలేనికి చెందిన మర్లపూడి మనీషకు మానవత సంస్థ మండల శాఖ ఆదివారం రూ.7,500 ఆర్థిక సాయం చేసింది. కార్యక్రమంలో మానవత సంస్థ డైరెక్టర్ పాతూరి సత్యనారాయణ, మండల ట్రెజరర్ ఐడీపీ అప్పారావు, సభ్యులు పత్తిపాటి గంగాధరరావు, కె.చంద్రశేఖర్, కోడూరి నాగేశ్వరరావు, కసుకుర్తి వెంకట కృష్ణారావు పాల్గొన్నారు.

పండ్లతో బాలికకు తులాభారం



అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి గుడిలో తులాభారం వేస్తున్న దృశ్యం

పెరవలి: దేవునికి మొక్కులు చెల్లించుకోవడంలో ఒక్కొక్కరిది ఒక్కో తీరు. ఈ మొక్కుబడి మరీ విచిత్రం. పెనుగొండకు చెందిన గుర్రాల శ్రీనివాస్ తన కుమార్తె మొక్కును కేవలం వివిధ రకాల పండ్లతో తులాభారం వేయించి చెల్లించుకున్నారు. ముందుగా అరటిగెలలు వేయగా, తర్వాత కొబ్బరికాయలు, అనంతరం బత్తాయిలు, యాపిల్స్, జామకాయలు, డ్రాగన్ ఫ్రూట్స్‌తో తులాభారం వేయించారు. ఇంతకీ ఆయన ఈ తులాభారాన్ని అన్నవరప్పాడులో కొలువైన వేంకటేశ్వరస్వామివారికి సమర్పించుకున్నారు.

రైలులో నుంచి జారి పడిన యువకుడికి గాయాలు

చాగల్లు: రైలులో నుంచి జారిపడి ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన మండలంలోని బ్రాహ్మణగూడెంలో ఆదివారం చోటు చేసుకుంది. మేడపాడుకు చెందిన లక్ష్మీనారాయణ అనే యువకుడు విజయవాడ కనకదుర్గమ్మ దర్శనానికి వెళ్లి రత్నాచల్ ఎక్స్‌ప్రెస్‌లో తిరిగి వస్తున్నాడు. అతడు బ్రాహ్మణగూడెం శివార్లలో ట్రైన్ నుంచి కింద జారిపడ్డాడు. తీవ్రగాయాలైన లక్ష్మీనారాయణ ఆర్తనాదాలు చేయడంతో రైల్వే ట్రాక్ పక్కనే ఉన్న కాలనీ వాసులు అతనికి సపర్యలు చేసి 108కి, అతడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. 108లో తొలుత అతడిని నిడదవోలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు.

ఎర్ర మట్టి తరలిస్తున్న లారీ స్వాధీనం

తాళ్లపూడి: అనుమతి లేకుండా ఎర్ర మట్టి తరలిస్తున్న లారీని పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. ఖాళీ స్థలాలను మెరక చేసేందుకు మండలంలోని గోపవరం గ్రామ సమీపం నుంచి ఈ ఎర్ర మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న తాళ్లపూడి ఎస్సై టి.రామకృష్ణ తన సిబ్బందితో వెళ్లి లారీని స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు.

పేకాట స్థావరాలపై దాడులు

నల్లజర్ల: మండలంలో నిర్వహిస్తున్న రెండు పేకాట స్థావరాలపై ఆదివారం రాత్రి స్పెషల్ పోలీసులు దాడులు చేశారు. చీపురుగూడెం అటవీ ప్రాంతంలో పాకుళ్లమ్మగుడి సమీపంలో ఒక పేకాట స్థావరంపై దాడి చేసి, ముగ్గురిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.5,100 స్వాధీనం చేసుకున్నారు. మరో చోట దాడి చేసి 11 మందిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.లక్షా 17,650 స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 14 మందినీ నల్లజర్ల పోలీస్ స్టేషన్‌కు అప్పగించి కేసులు నమోదు చేశారు.

కొవ్వూరు: దొమ్మేరు గ్రామంలో పేకాడుతున్న ఐదుగురు వ్యక్తులను ఆదివారం రాత్రి అరెస్టు చేసినట్టు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. వారి వద్ద నుంచి రూ.18,000 నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితులను సోమవారం కోర్టుకు హాజరు పరచనున్నట్టు ఆయన తెలిపారు.

లక్కు దక్కేదెవరికో?

- నేడు డ్రా ద్వారా మద్యం దుకాణాల ఎంపిక
- కొవ్వూరు డివిజన్‌లో 49 షాపులకు 2,352 దరఖాస్తులు
- రాష్ట్ర ప్రభుత్వానికి రూ.47.04 కోట్ల ఆదాయం





కొవ్వూరు ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం

కొవ్వూరు: మద్యం షాపుల దరఖాస్తుదారుల భవితవ్యం సోమవారం తేలనుంది. ఒక్కో షాపునకు సరాసరిన 50 మందికి పైగా పోటీ పడుతున్నారు. కొవ్వూరు డివిజన్ వ్యాప్తంగా 49 దుకాణాలకు ఏకంగా 2,352 మంది దరఖాస్తు చేసుకున్నారు. లాటరీ పద్ధతిలో వారిలో 49 మందికి మాత్రమే దుకాణాలు దక్కుతాయి. ఆ 49 మంది అదృష్టవంతులూ ఎవరనేది సోమవారం సాయంత్రం లోపు తేలుతుంది. ఒక్కో షాపునకు రూ.2 లక్షల చొప్పున రూ.47.04 కోట్లు దరఖాస్తు రుసుము చెల్లించారు. డ్రా లో దుకాణం రాకపోతే రూ.2 లక్షల దరఖాస్తు ఫీజు వదులుకోవాల్సిందే. రాజమహేంద్రవరంలోని ఆనం కళాకేంద్రంలో జిల్లా కలెక్టర్ ప్రశాంతి చేతుల మీదుగా సోమవారం డ్రా పద్ధతిలో దుకాణాలు కేటాయిస్తారు. మద్యం వ్యాపారం గురించి కనీస అవగాహన లేని కొందరు కొత్తవారు సైతం ఈసారి దరఖాస్తు చేసుకున్నారు. సోమవారం డ్రాలో ఎంపికైన దుకాణదారులు ఈ నెల 16వ తేదీ నుంచి కొత్త దుకాణాలను ప్రారంభించాలి. డివిజన్‌లోని గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల, పెరవలి, చాగల్లు మండలాల్లో మద్యం దుకాణాలకు ఎక్కువ పోటీ ఏర్పడింది.

ఆ 49 మంది అదృష్టవంతులెవరో?

నిడదవోలు ఎక్సైజ్ సర్కిల్‌లో 19 దుకాణాలుంటే 861 మంది దరఖాస్తు చేసుకున్నారు. దేవరపల్లి సర్కిల్‌లో 14 దుకాణాలకు 776 మంది, కొవ్వూరు సర్కిల్‌లో 16 షాపులకు 715 మంది దరఖాస్తు చేసుకున్నారు. మండలాల వారీగా గోపాలపురంలో మూడు షాపులకు ఏకంగా 187 మంది పోటీ పడుతున్నారు. అంటే సరాసరిన ఒక్కో షాపునకు 62.3 శాతం మంది పోటీలో ఉన్నారు. దేవరపల్లిలో ఒక్కో షాపునకు 58 శాతం మంది చొప్పున, నల్లజర్లలో 49.7 మంది, చాగల్లులో 48 శాతం మంది, పెరవలిలో ఒక్కో దుకాణానికి 50 మంది లెక్కన, తాళ్లపూడిలో 45.5 శాతం, కొవ్వూరులో 42.5, ఉండ్రాజవరంలో 41.4 శాతం మంది చొప్పున పోటీలో ఉన్నారు. నిడదవోలు టౌన్, రూరల్ కలిపి తొమ్మిది షాపులుంటే 390 మంది పోటీ పడుతున్నారు. కొవ్వూరు మండలం, మున్సిపాలిటీ కలిపి 8 షాపులకు 340 మంది, నల్లజర్ల మండలంలో ఆరు షాపులకు 298 మంది, దేవరపల్లి మండలంలో ఐదింటికి 290 మంది, తాళ్లపూడి మండలంలో నాలుగు షాపులకు 183 మంది, చాగల్లు మండలంలో నాలుగు షాపులకు 192 మంది, ఉండ్రాజవరం మండలంలో ఐదు షాపులకు 207, పెరవలి మండలంలో ఐదింటికి 250 మంది దరఖాస్తు చేసుకున్నారు.

కూటమి నేతల సిండికేట్ల హవా

కూటమి పార్టీల నేతలు గ్రూపులుగా ఏర్పడి మద్యం షాపులకు భారీగా దరఖాస్తులు చేశారు. ప్రతి దుకాణానికి పదుల సంఖ్యలో దరఖాస్తులు వేశారు. కొవ్వూరుకు చెందిన ఓ సిండికేట్ 120 వరకూ దరఖాస్తు చేసినట్టు చెబుతున్నారు. మరో సిండికేట్‌లో 240 వరకూ దరఖాస్తు చేసినట్టు సమాచారం. జంగారెడ్డిగూడేనికి చెందిన మద్యం వ్యాపారులు వైజాగ్ నుంచి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వరకూ ఏకంగా 400 దరఖాస్తులు వేసినట్టు తెలిసింది. వారిలో అత్యధికులు కూటమి నేతలే. మండలాన్ని, పట్టణాన్ని యూనిట్‌గా తీసుకుని దుకాణాలు ఏర్పాటు చేసుకునే వెసులుబాటు ఉంది. దీంతో మండలంలోని ఏ గ్రామంలోనైనా ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంది. పట్టణంలోనూ ఇదే పరిస్థితి ఉంటుంది. ఈ నేపథ్యంలో లాభసాటిగా ఉండే ఒకే ప్రాంతంలోనే షాపులు కేంద్రీకృతమైతే మొదటికే నష్టపోవాల్సి ఉంటుంది. దీంతో మద్యం వ్యాపారులు సిండికేట్ కాక తప్పని పరిస్థితి నెలకొంది. మద్యం బెల్టు షాపుల ఏర్పాటు, ఎమ్మార్పీ కంటే అధిక ధరల విక్రయాలపై కూటమి నేతలు దృష్టి సారించారు. దీనిలో భాగంగా దరఖాస్తుదారులను తమకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నాలు చేస్తున్నారు.

నిబంధనలకు లోబడి దుకాణాల నిర్వహణ



ప్రభుత్వ నిబంధనలకు లోబడి మద్యం దుకాణాలు నిర్వహించాలి. వాటిని అతిక్రమిస్తే చర్యలు తప్పవు. కొవ్వూరు సర్కిల్‌లో 16 షాపులకు 715 దరఖాస్తులందాయి. అన్ని సర్కిళ్లలోను ఇదే తరహాలో అప్లికేషన్లు అందాయి. 16వ తేదీ నుంచి ప్రైవేట్ మద్యం దుకాణాల్లో అమ్మకాలు ప్రారంభం అవుతాయి.

– కె. సత్యనారాయణ, ఎక్సైజ్ సీఐ, కొవ్వూరు

ఈ నిబంధనలు తప్పనిసరి

- విద్యా సంస్థలు, ఆసుపత్రులు, ప్రార్థనా మందిరాలకు వంద మీటర్ల లోగా మద్యం దుకాణాలు ఏర్పాటు చేయకూడదు.
- జాతీయ రహదారి, రాష్ట్ర రహదారులకు 500 మీటర్లు దూరంలో షాపులు ఏర్పాటు చేయాలి. హైవేలపై మద్యం దుకాణం ఉందని తెలియజేసేందుకు ఏవిధమైన సైన్ బోర్డులు, ప్రకటన బోర్డులు ఏర్పాటు చేయకూడదు.
- మండల కేంద్రం 20 వేల కంటే తక్కువ జనాభా ఉంటే, స్టేట్ హైవేలకు 220 మీటర్లు దూరంలో మద్యం దుకాణం పెట్టుకోవచ్చు.
- మండలాన్ని ఒక యూనిట్‌గాను, మున్సిపాలిటీ, నగర కార్పొరేషన్‌ను ఒక యూనిట్‌గా తీసుకుని మద్యం దుకాణం ఎక్కడైనా ఏర్పాటు చేసుకునే వెసులుబాటు ఉంది.
- మద్యం దుకాణాల్లో ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకూ మాత్రమే విక్రయాలు సాగించాలి. బార్లకు ఉదయం 11 నుంచి రాత్రి 11 గంటల వరకూ అనుమతి ఉంటుంది.

నేటి నుంచి పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాలు

నిడదవోలు రూరల్: పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సోమవారం నుంచి పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాలను మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ డి.లక్ష్మీనారాయణ ఆదివారం తెలిపారు. మండలంలోని సింగవరం గ్రామంలో సోమవారం ఉదయం 8 గంటలకు జరిగే కార్యక్రమానికి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్, కలెక్టర్ పి.ప్రశాంతి హాజరవుతారని చెప్పారు. అలాగే సోమవారం సింగవరం, కంసాలిపాలెం, రావిమెట్ల, తిమ్మరాజుపాలెం, సూరాపురం, కాటకోటేశ్వరం, ఉనకరమిల్లి, తాడిమళ్ల, కోరుమామిడి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు.

టౌన్ చర్చిలో ఘనంగా వుమన్ సండే



క్రీస్తు సువార్త గీతాలు ఆలపిస్తున్న సంఘ మహిళలు

నిడదవోలు: స్థానిక రాయిపేటలోని మెంటే సుందరరావు మెమోరియల్ టౌన్ లూథరన్ చర్చిలో వుమన్ సండే, మహిళల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ రెవరెండ్ కె. కమలాకర్ ఆధ్వర్యంలో మహిళలు వాక్య పఠనం, ప్రార్థన, ఆరాధన చేశారు. సంఘ మహిళలు ప్రత్యేక క్రీస్తు సువార్త గీతాలు ఆలపించారు. భీమవరం నుంచి వచ్చిన సిస్టర్ జి. దెబోరా ప్రసంగిస్తూ మహిళలు ప్రార్థన శక్తితో సజీవ నిరీక్షణ కోసం ఎదురు చూడాలన్నారు. స్త్రీ సమాజం ఆధ్వర్యంలో సిస్టర్ దెబోరాను సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బైబిల్ క్విజ్, బైబిల్ టెస్ట్ పోటీల్లో విజేతలైన మహిళలు, సంఘ యువతకు చర్చి చైర్‌పర్సన్ మెంటే దయారాజగిరి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

ఆత్మీయ వేడుక.. అనుభూతుల వేదిక



సమిశ్రగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాల 2006-07 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు, ఉపాధ్యాయులు



ఊనగట్ల జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

17 ఏళ్ల తర్వాత కలుసుకున్న సమిశ్రగూడెం పూర్వ విద్యార్థులు

నిడదవోలు రూరల్: ఎక్కడో పుట్టి.. ఎక్కడో పెరిగి. ఒకే బడిలో కలిసి చదువుకుని విడిపోయిన ఆ విద్యార్థులు 17 ఏళ్ల అనంతరం కలుసుకుని ఆత్మీయతానురాగాలు పంచుకున్నారు. వారిలో కొందరు రాజకీయాల ద్వారా ప్రజలకు సేవలు అందిస్తుండగా, మరికొందరు ఉన్నత విద్యావంతులు కాగా, ఇంకొందరు వివిధ రంగాల్లో రాణిస్తున్నారు. గృహిణులుగా తమ పిల్లల ఆలనాపాలనా చూస్తున్నారు. మండలంలోని సమిశ్రగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాల 2006-07 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులంతా ఆదివారం ఆ పాఠశాల ఆవరణలోనే సమావేశమయ్యారు. పూర్వ విద్యార్థి, గ్రామ సర్పంచ్ దేశాబత్తుల జ్యోత్స్నప్రియాంక ఆధ్వర్యంలో ఎంఈఓ పి.గురుమూర్తి, ఉపాధ్యాయులు ఎల్.సత్యనారాయణ, మోహన్‌కృష్ణ తదితరులను ఘనంగా సత్కరించారు. అనంతరం అందరూ కలిసి విందు ఆరగించారు. పూర్వ విద్యార్థులు పి.ప్రదీప్, ఎం.చంద్రమౌళి, డి.ఓంకార్, ఆర్.రాజేంద్ర, వి.కిరణ్‌స్వరూప్ తదితరులు కార్యక్రమ నిర్వహణను పర్యవేక్షించారు.

మూడు దశాబ్దాల తర్వాత..

చాగల్లు: ఊనగట్ల జెడ్పీ హైస్కూల్ 1990-94 బ్యాచ్ (6వ తరగతి నుంచి 10వ తరగతి వరకూ) విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం జరిగింది. తమ కుటుంబాలతో సహా హాజరైన సుమారు 60 మంది పూర్వ విద్యార్థులు నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. వివిధ ప్రాంతాల్లో ఉన్నత స్థాయిల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు తమ అనుభవాలను పంచుకున్నారు. సుమారు 30 ఏళ్ల తర్వాత తమ స్నేహితులందరినీ ఒక చోట మళ్లీ కలుసుకోవడం ఆనందంగా ఉందని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. నాడు తమకు విద్య బోధించిన ఉపాధ్యాయులు ఆచార్యులు, అప్పారావు, సూర్యకుమారిలను పూర్వ విద్యార్థులు సత్కరించారు. ఈ అపురూప కలయికకు కృషి చేసిన గన్నమని నాగ రామకృష్ణ, ఉప్పులూరి శ్రీనివాసు, కొండేపాటి మునేశ్వరరావు, నందిగం పద్మావతి తదితరులను పూర్వ విద్యార్థులు అభినందించారు.

కోటసత్తెమ్మకు వెండి పాదుకల సమర్పణ

- అమ్మవారికి వివిధ రూపాల్లో రూ.4,88,702 ఆదాయం
- 225 మంది దంపతుల సహస్ర నామ కుంకుమ పూజలు



ప్రత్యేక పుష్పాలంకరణలో కోటసత్తెమ్మ వారు



కోటసత్తెమ్మ గుడిలో అమ్మవారి దీక్ష విరమిస్తున్న భక్తులు



అమ్మవారికి వెండి పాదుకలు సమర్పిస్తున్న దాతలు

నిడదవోలు రూరల్: దసరా సంబరాలు అంబరాన్నంటాయి. శరన్నవ రాత్రుల ముగింపు ఉత్సవాల్లో భాగంగా మండలంలోని తిమ్మరాజుపాలెంలో కొలువైన కోటసత్తెమ్మ వారిని శని, ఆదివారాల్లో వేలాదిగా భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో అమ్మవారికి 225 మంది దంపతులు సహస్ర నామ కుంకుమ పూజలతో పాటు చండీ పారాయణం, హోమాలు, శమీ పూజలు నిర్వహించారు. దాతల తోడ్పాటులో భక్తులకు చక్కెర పొంగలి, దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదానంతో పాటు పులిహోరను ప్రసాదంగా పంపిణీ చేశారు. అమ్మవారికి వివిధ రూపాల్లో రూ.4,88,702 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరిసూర్య ప్రకాష్ తెలిపారు. కోటసత్తెమ్మను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ దర్శించుకుని పూజలు చేశారు. అమ్మవారికి చిట్యాల నరసింహారావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు అమరసాయి తేజ 500 గ్రాముల వెండి పాదుకలు సమర్పించారు. గోపవరం గుబ్బాలమ్మ, తాడిమళ్ల గౌడివీధిలో దుర్గాదేవీ విగ్రహాలను ప్రత్యేకంగా పుష్పాలతో అలంకరించి విశేష కుంకుమపూజలు జరిపించారు.

కోలాహలంగా జగన్మాత ఊరేగింపు



అన్నవరప్పాడులో ఇరుముడులతో ఊరేగింపుగా విజయవాడు పయనమైన భవానీలు



చాగల్లు మండలం బ్రాహ్మణగూడెంలో కనకదుర్గమ్మ వారి విగ్రహం ఊరేగింపు



చాగల్లు మండలం ఊనగట్ల అమ్మవారి ఊరేగింపులో బుట్టబొమ్మలు, గొర్ర గేదెలు



తాళ్లపూడిలో కనకదుర్గమ్మ రథం లాగుతున్న భక్తులు



తాళ్లపూడిలో సువాసిని పూజ

పెరవలి: తొమ్మిది రోజుల పాటు రోజుకొక రూపంలో భక్తుల పూజలు అందుకున్న దుర్గామాతను విజయదశమి రోజైన శనివారం ఊరేగించారు. మండలంలోని కానూరు, ఖండవల్లి, ముక్కామల, పెరవలి, తీపర్రు, కాకరపర్రు, అన్నవరప్పాడు గ్రామాల్లో అమ్మవారి విగ్రహాల ఊరేగింపులు సందడిగా సాగాయి. బ్యాండ్ మేళాలు, బాజా భజంత్రీలతో కోలాహలంగా ఊరేగింపులు జరిగాయి. కంజెర డప్పులకు అనుగుణంగా యువత చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఖండవల్లి వీధుల్లో ఊరేగిన కనకదుర్గమ్మ వారికి ప్రతి ఇంటి వద్దా భక్తులు పసుపు, కుంకుమ, పూలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గోదావరి నదిలోను, కాలువల్లోనూ అమ్మవారి విగ్రహాలను నిమజ్జనం చేశారు. అన్నవరప్పాడులో 175 మంది భవానీలు ఇడిముడులు ధరించి, ఊరేగింపుగా విజయవాడ బయలుదేరారు.

చాగల్లు: స్థానిక మాతంగి చెరువు గట్టుపై కొలువైన కనకదుర్గమ్మ వారిని శనివారం ఘనంగా ఊరేగించారు. గొర్ర గేదెలు, బుట్టబొమ్మలు, బ్యాండు మేళాలు, విచిత్ర వేషధారణలతో ఈ ఊరేగింపు అట్టహాసంగా సాగింది. అలాగే స్థానిక వాసవీ మాత ఆలయంలో అమ్మవారిని సందడిగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శక్తివేషాలు, బుట్టబొమ్మలు చూపరులను అలరించాయి. ఊనగట్లలో కనకదుర్గమ్మవారిని కూడా ఘనంగా ఊరేగించారు. చాగల్లు పాటమ్మ వారి ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. బ్రాహ్మణగూడెం శివాలయం వీధిలోని కనకదుర్గమ్మవారి ఊరేగింపు డప్పు వాయిద్యాలు, బ్యాండు మేళాలు, బాణసంచా కాల్పుల మధ్య కోలాహలంగా జరిగింది. రావుల చెరువు గట్టుపై గల కనకదుర్గమ్మ వారిని బుట్టబొమ్మలు, తీన్‌మార్ డప్పులతో ఊరేగింపుగా తీసుకువెళ్లి నిడదవోలు కాలువలో నిమజ్జనం చేశారు. ఎస్.ముప్పవరంలో ప్రతిష్ఠించిన కనకదుర్గమ్మ ఉత్సవ విగ్రహాన్ని ట్రాక్టరుపై గ్రామ వీధుల గుండా ఊరేగించారు.

తాళ్లపూడి: స్థానిక కనకదుర్గమ్మ వారిని శనివారం రాజరాజేశ్వరి దేవిగా అలంకరించారు. కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. అనంతరం నిర్వహించిన రథోత్సవంలో ఆయన పాల్గొన్నారు. గరగ నృత్యాలు, డప్పు వాయిద్యాలతో గ్రామ వీధుల గుండా ఈ రథోత్సవం సాగింది. భక్తులు అడుగడుగునా అమ్మవారికి పూలు చల్లుతూ, హారతులు పట్టారు. మహిళలు, చిన్నారులు ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది. వాహనాలకు పూజలు చేశారు. జమ్మి చెట్టుకు కాగితంపై గోత్ర నామాలు, కోరికలను రాసి చీటీలు ఉంచారు. చిన్నారులను నవదుర్గలుగా అలంకరించి సుహాసినీ పూజ చేశారు. అలాగే వేగేశ్వరపురంలోని దుర్గాసాయిరాం మేదర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు.





ముగిసిన శరన్నవరాత్ర మహోత్సవాలు



కుమారదేవంలో గండి పోశమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు



ఉండ్రాజవరం మండలం పాలంగిలో శమీ వృక్షానికి పూజ

కొవ్వూరు: శరన్నవరాత్ర మహోత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా శని, ఆదివారాలు ఆరికిరేవుల, దొమ్మేరు, వాడపల్లి గ్రామాల్లో అమ్మవారి విగ్రహాలను ఊరేగించారు. కుమారదేవంలోని గండి పోశమ్మవారికి శనివారం నిర్వహించిన పూజల్లో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం కొద్ది సేపు ఆయన భక్తులకు భోజనం వడ్డించారు. కొవ్వూరు ఆర్యవైశ్య కల్యాణ మంటపంలోను, సంస్కృత పాఠశాల ప్రాంగణంలోను శమీ పూజ నిర్వహించారు. మెరకవీధి కనక దుర్గమ్మ ఆలయం వద్ద ఆదివారం అన్న సమారాధన జరిగింది. గోష్పాదక్షేత్రంలోని జ్ఞాన సరస్వతి ఆలయం, మున్సిపల్ ఆఫీసు వద్ద గల కనకదుర్గ ఆలయాల్లోను విశేష పూజలు జరిగాయి. ఐదో వార్డు గోపాలస్వామి గుడి వద్ద ప్రతిష్ఠించిన దుర్గాదేవి శిబిరం వద్ద, లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మినీ బైపాస్ రోడ్డు పెట్రోలు బంక్ జంక్షన్ వద్ద సోమవారం అన్నసమారాధనలు జరుగుతాయి.

ఉండ్రాజవరం: మండలంలోని పలు గ్రామాల్లో అమ్మవార్లను శనివారం రాజరాజేశ్వరీ దేవిగా అలంకరించారు. అమ్మవార్లకు సహస్ర నామాలతో కుంకుమ పూజలు, లలిత పారాయణ చేశారు. ఉండ్రాజవరంతో పాటు వేలివెన్ను, మోర్త, పాలంగి, కె.సావరం, పసలపూడి తదితర గ్రామాల్లో శమీవృక్ష దేవతా పూజ నిర్వహించారు. పులిహోర, బూరెలు భక్తులకు అందజేశారు. పాలంగి, మోర్త, వేలివెన్ను, తాడిపర్రు గ్రామాల్లో ఆదివారం వైభంగా అమ్మవార్ల ఊరేగింపులు నిర్వహించారు. వెలగదుర్రులో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వార్లను నూతన గరుడ వాహనంలో ఊరేగించారు. దమ్మెన్నులో అన్నసమారాధన జరిగింది.